
# సాయంసంధ్య



ధూళిపాళ అన్నపూర్ణ

నాలుగురోజులుగా ఇక్కడకు రావాలన్న ఆతృత. ఈ నదీమ తల్లి ఒడిలో వాలితే కొంత ప్రశాంతత. కానీ ప్రయాణపు బడలిక. అక్కడ ఓవర్‌బ్రిడ్జ్ ఎక్కి దిగి రైలు ఎక్కడం. మళ్ళీ ఇక్కడ దిగడం. నా ఒళ్లు నా స్వాధీనంలోకి రావడానికి ఇన్నిరోజులు పట్టింది. నాకు చిన్నప్పటినుండి ఈ గోదావరి తల్లి దగ్గర ఏ సమయానికి కావలసిన మందు ఆ సమయానికి దొరుకుతూ వస్తోంది. ఈ అరవైఏళ్ళ వయసులో- ఈ భాద్రపద మాసంలో ఉధృతంగా ప్రవాహవేగంతో పయనిస్తున్న ఈ నదిని చూస్తుంటే ఒక జీవితకాలం నాముందుకు వస్తోంది. బాగా వరదనీరు తగిలినట్లు ఉంది. నీరు ఎర్రగా ఉంది. కొంతమంది పిల్లలు ప్రవాహానికి ఎదురేగి కావలసిన కర్రలు తెచ్చుకుంటున్నారు. ప్రవాహంలో ఎన్నో కొట్టుకువస్తున్నాయి. కుళ్ళిపోయిన కళేబరాలు, ముళ్ళకంపలు, పెద్దదుంగలు, పాములు పూలకొమ్మలు అన్నీ ప్రవాహంపై తేలుతున్నాయి. ఈ నదీస్వరూపాన్ని ఇలా చూసేక చిన్నప్పుడు మంచినీళ్ళు గొంతులో దిగేవికావు. మా అమ్మ ఇందుగ తీసి ఆ ఎరుపు విరిచి వడబోసి తేరిన నీరు తెచ్చి ఇచ్చేది. కొంచెం పెద్దయ్యాక కార్తీకమాసంలో స్నానానికి వచ్చినప్పుడు ప్రశాంతంగా సాగుతున్న ఈ ప్రవాహంలో మునగగానే నా జీవితపు బరువంతా తాను తీసుకుని నన్ను తేలికపరిచేది ఈ తల్లి. అన్ని కాలుష్యాల్ని తాను తీసుకుని దూరంగా మోసుకెళ్ళే సహనదీప్తి కలిగిన ఈ ఆర్ద్ర హృదయ- ఈ గోదావరిని ఇప్పుడు చూస్తుంటే నాగు చెప్పిన మాటలు నా చెవుల్లో మారుమ్రోగుతున్నాయి. కానీ ఆచరణ నావల్ల సాధ్యమేనా?

ఆయన ఎప్పుడూ చెబుతూ ఉండేవారు. "మొగపిల్లలకి అన్ని బలాలకంటె అధికబలమైన సంఘబలం వాళ్ళవెంట ఉంటుంది మన సమాజంలో. ఆడపిల్లలకి దాన్ని ఎదుర్కొందుకు మనం విద్యాబలాన్ని, ఆర్థిక బలాన్ని ఇవ్వాలి. వీటిద్వారా వాళ్ళ ఆత్మబలాన్ని పెంచాలి. పిల్లలిద్దర్నీ ఏమీ అనొద్దు. వాళ్ళు స్వేచ్ఛగా ఆలోచించుకునే అవకాశమివ్వు" అని. నిజంగానే రమనీ, కుసుమనీ చాలా ప్రత్యేకంగా పెంచారు ఆయన. వీళ్ళిద్దరి మధ్యలో రాజు. ఆలోచిస్తే రాజుకూడా విలక్షణంగా పెరిగినట్లే! అందరి ఇళ్ళలోలాగ మొగపిల్లవాడన్న ప్రత్యేక హోదా ఏమీ వాడికుండేది కాదు. పైగా ఈ పిల్లలిద్దరికీ- చదువూ సంధ్యల్లో వాడు ఎంతో సాయం చెయ్యవలసి వచ్చేది. మిగిలిన ఇళ్ళలో మొగపిల్లలతో తనను పోల్చుకుని వాళ్ళ నాన్న వెనక్కాల సణుగుతూ ఉండేవాడు.

ఆడపిల్లలిద్దరూ చాలా శ్రద్ధగా చదువుకున్నారు. ఉద్యోగాలు రావాలన్నారు. ఇద్దరూ ఉద్యోగాలు వచ్చాకే పెళ్ళిళ్ళు చేసుకున్నారు. అన్నిటిలోనూ వాళ్ళనాన్న వాళ్ళ ఇష్టానికి- వాళ్ళ సుఖానికే ప్రాముఖ్యమిచ్చారు. దాంట్లో మేమిద్దరం ఎంత నలిగిపోయినా వాళ్ళకి వీలు కల్పించడానికి ఎంతో ప్రయత్నించారు.

పెద్దపిల్ల రమపెళ్ళి అయిన కొత్తలో వాళ్ళ జీవితంకేసి నేను చాలా కుతూహలంగా చూసేదాన్ని. ఎందుకంటే ఇద్దరూ చదువుకున్నవాళ్ళు- సంపాదించుకుంటున్నవాళ్ళు. వాళ్ళ వివేకంతో వాళ్ళ జీవితం సుగంధభరితమవుతుందని నాకు అన్పించేది. నాకు చాలా చిన్నప్పుడు అంటే పదమూడుఏళ్ళకే పెళ్ళి అయిపోయింది. నా పదిహేనవ ఏట నేను ఆయన దగ్గర చేరాను. అప్పటినుండి నాకు, నేను- నా జీవితం అన్నమాటలు గుర్తులేవు. కొత్తలో నా సమస్త శక్తీ ఆయనని సంతోషపెట్టడానికి ఉపయోగించేదాన్ని. తరువాత పిల్లలూ- వాళ్ళ చదువులూ వాళ్ళ ఇష్టాలూ వాళ్ళ స్నేహాలూ. వీటిమధ్యలో నాకు ఊపిరి సలిపేది కాదు. ఇంతలో పిల్లలకీ ఆయనకీ మధ్యలో వచ్చే చిన్నతేడాలూ... దాని వల్ల వాళ్ళ మనసుకి కలిగే కష్టాలూ వీటిని సరిచెయ్యడానికి నా తెలివితేటలూ- ఒర్పూ సరిపోయేవి. నాకు నచ్చనిదేదైనా ఉన్నా కూడా ఎవ్వరిదగ్గరా చెప్పలేకపోయేదాన్ని. సంసారంలోఉన్న మిగిలిన ఇష్టాలకంటె నాకు నా ఇష్టం ముఖ్యమని పించేది కాదని ఇప్పుడు అనిపిస్తోంది. నాకూ ఇష్టాలూ- అయిష్టాలూ ఉండేవి.

ఈ నా జీవితపు నేపథ్యంలో మా రమ జీవితం ఆనందసౌధంలా అనిపించేది. కానీ అదికూడా వచ్చి అప్పుడప్పుడు నా ఒళ్ళో పడుకుని కళ్ళనీళ్ళు పెట్టుకునేది. వాళ్ళ నాన్నకు ఏమీ తెలియనిచ్చేది కాదు. అన్ని స్వతంత్రాలు ఉన్న ఈ పిల్లకి ఈ దుఃఖమెందుకా అని నాకు అశాంతిగా- అలజడిగా ఉండేది. వెళ్ళి వాళ్ళ ఇంట్లో ఉండి నాలుగురోజులు పరిశీలిద్దామంటే కుదిరేదికాదు. నిజానికి మరి అతను చాలా మంచివాడు. ఎప్పుడు ఇక్కడకు వచ్చి నా దాన్ని ఏడుమల్లెపువ్వులెత్తులా చూసుకునేవాడు. ఎక్కడా అలవనిచ్చేవాడు కాదు. దాని మనసెరిగి సున్నితంగా ప్రవర్తించడం తెలిసేది కాదా? అని ఒకసారి నొక్కి అడిగినపుడు రమ అంది. "ఒక మనిషిగా నాకు విలువివ్వడం తెలియదమ్మా! నా చదువు- నా జ్ఞానం ఇవన్నీ కేవలం డబ్బు సంపాదించడానికే ఉపయోగపడుతున్నాయి. స్వతంత్రించి ఒక్క నిర్ణయం తీసుకోవడానికి నాకు అవకాశంలేదు" అని. నేను తెల్లబోయాను. నీకు కావలసినవన్నీ అతనే సమకూర్చుతాడుకదే! నీకేం లోటు తల్లీ!" అని దాన్ని ఓదార్చబోయాను. తరువాత దాని బాధని నేను అంత ఎక్కువగా పట్టించుకోలేదు.

చిన్నపిల్ల కుసుమ పెళ్ళి పెద్దదాని పెళ్ళయిన పదేళ్ళకి అయింది. దానికి మంచి ఉద్యోగం దొరికింది. రాజు కూడా అయిదేళ్ళ ముందే మంచి ఉద్యోగంలో చేరాడు. పెళ్ళి చేసుకున్నాడు. ఒక పాప కూడా. ఈ పదేళ్ళలో బయటి ప్రపంచంలో చాలామార్పులు వచ్చాయి. అమ్మాయిలంతా ధైర్యంగా బయట ఊళ్ళలో ఉండి చదువుకుంటున్నారు. మోటారుబైక్స్ మీద తప్ప తిరగడంలేదు. పద్దెనిమిది సంవత్సరాల పిల్లల ఒంటిమీద ఎక్కడా చీరలు కన్పించడంలేదు. దూరంనుంచి చూస్తే ఆడపిల్లలనీ మొగపిల్లలనీ పోల్చుకోలేకపోతున్నాము. అన్నిటా మొగపిల్లలతో సమంగా ఆడపిల్లలు ఉరకలు వేస్తున్నారు.

మా ఇంట్లో కూడా చాలామార్పులు వచ్చాయి. నా జీవితంలోని చైతన్యాన్నంతనూ ఏ మనిషికి ధారపోశానో ఆ మనిషే చైతన్యహీనమై బూడిదైపోయారు. విశాలమైన మైదానంలోని ఒంటరిచెట్టులా నేను మిగిలాను. ఇప్పుడు నాకు నా ఇష్టాలూ- సరదాలూ గుర్తుకే లేవు. ఎక్కడైనా ఈ జీవనం ప్రశాంతంగా గడిచిపోతే చాలు. కానీ ఈ పిల్లలు కొత్తగా పోల్చుకున్న ఈ రెక్కలతో ఎగరడానికి చేసే ఈ సంఘర్షణలో అదికూడా అసాధ్యమా అని అనిపించింది నాకు 'నాగు' దగ్గరకు వెళ్ళేవరకు.

ఇంతకూ నాగు ఎవరో చెప్పలేదు కదూ! మా చిన్నక్క కూతురు. చిన్నప్పుడు ఎస్ఎస్ఎల్‌సి వరకు మా ఇంట్లో ఉండి



2

చదువుకుంది. చాలా తెలివైంది. హుషారైంది. వాళ్ళ బాబయ్య "ఇది పెద్ద ఉద్యోగస్తురాలవుతుంది చూడు" అని అస్తమానూ అంటూ ఉండేవారు. కానీ మా అక్కయ్య దానికి మంచి సంబంధం వచ్చిందని ఎస్ఎస్ఎల్‌సి అవడంతోనే పెళ్ళి చేసేసింది. అతను ఏదో మంచి ఉద్యోగమే చేస్తున్నాడు. మా అక్కని చూడడానికి వచ్చినప్పుడల్లా నా దగ్గరకు వచ్చి వాళ్ళ బాబయ్యతో కబుర్లు చెప్పి వెడుతూ ఉండేది. ఆయన పోయిన కొన్నాళ్ళకి కుసుమ వచ్చి దాని దగ్గరకు తీసుకువెళ్ళింది. అప్పుడు ఒకరోజు నాగు హఠాత్తుగా వచ్చి నన్ను చూసి నా ఒళ్ళో చేరి చాలాసేపు ఏడ్చింది. నేనే దానిని ఊరుకోబెట్టవలసి వచ్చింది. తనతో రమ్మని చాలా పట్టు బట్టింది. కొన్నాళ్ళయ్యాక వస్తానని చెప్పి పంపించాను.

గబగబ పరిగెడుతున్న వీళ్ల జీవితాల్లో, అంతకంటె వేగంగా పరుగులు తీస్తున్న ఈ హైదరాబాదు నగరంలో, మెరుపులా తళుక్కుమంటున్న ఈ నాగరికతలో ప్రశాంతమైన జీవనం నాకు సాధ్యంకాదేమో అని ఆలోచిస్తున్నాను. తనతో సమంగా ఇంటాబయటా వాళ్ళాయనకూడా సహకరించాలన్న డిమాండ్ కుసుమది. ఆడపిల్లతో సమంగా లేచి వండి కూడా ఉండాలన్న విషయం అతను ఈ సంఘం నుండి నేర్చుకోలేదు. ఎప్పుడైనా ఏ కొంచెమైనా చేసినా అదే చాలా గొప్ప విషయమన్నట్టు భావిస్తూ ఉంటాడు. ఈ తేడా వీళ్ళిద్దరిలో నాకు కనిపిస్తూ ఉంది. ఇంకా ఏమైనా ఉన్నాయా అన్నది నా బుద్ధికి అందలేదు. ఏమైనా ఇద్దరూ నిత్యం ఘర్షణ పడుతూ ఉంటారు. ఈ ఇద్దరి మధ్య వంతెన అనేది లేనేలేదు. ఇలాంటి ఇద్దరి మధ్యలో మూడవ వ్యక్తి ఇమడడం అంతసులువా? నేను మొదటి నుండి పిల్లల దగ్గరే ఉండాలని భావి స్తూ వస్తున్నాను. అందరి ఉనికిని- అందరి ప్రశాంతతనూ కాపాడడం కోసం మాకున్న అన్ని కష్టాల్ని- అయిష్టాల్ని మరిచిపోయి సహనంతో జీవించాము మేము. దానిమూలంగా ఇళ్ళన్నీ దావానలాన్ని కడుపులో పెట్టుకున్న ప్రశాంతమైన వనంలా ఉండేవి. ఇప్పుడు వీళ్ళు దావానలాన్ని బైటికి కక్కుతున్నారు. చుట్టూ అన్నీ మండుతున్నట్టు ఉన్నాయి. ఈ మంటలోంచి మెల్లిగా మళ్ళీ చిగురించాలి.

ఇంతలో మళ్ళీ నాగువచ్చి నన్ను వాళ్ళింటికి తీసుకుని వెళ్ళింది. ఆ ఇల్లు చూస్తే చలువపందిరి అన్నమాట గుర్తుకు వచ్చింది. ఇల్లంతా రకరకాల మొక్కలతో ఆకుపచ్చగా ఉంది. సంసారమెప్పుడూ పచ్చతోరణంలా ఉండాలి అని మా అమ్మ అంటూ ఉండేది. ఆ మాట గుర్తుకువచ్చింది. అతను కేంప్‌కి వెళ్ళాడట. పిల్లాడూ అదీ ఉన్నారు. ఆ రాత్రీ నేనూ అదీ ఒక మంచమ్మీదే పడుకున్నాము. నా మీద చెయ్యేసి నాకు దగ్గరగా పడుకుని వాళ్ళ బాబయ్య కబుర్లన్నీ జ్ఞాపకం చేసుకుంది. నెమ్మదిగా దాని సంసారంలో సంగతులన్నీ చెప్పుకుంటూ వచ్చింది.

"పిన్నీ! నేను ఈ ఇంట్లో అడుగు పెట్టేడప్పటికి ఈయన నైట్‌కాలేజీలో చదువుకుంటూ ఉండేవాడు. ఏమీ పట్టించుకునేవాడు కాదు. డబ్బంతా తెచ్చి నా చేతిలో పెట్టేవాడు. అన్నీ సర్దుకుని పొదుపుగా ఖర్చు చేస్తూ సంసారాన్ని దొల్లిస్తూ ఉండేదాన్ని. అతనికి పగలు ఆఫీసు- రాత్రి చదువు. నాకు ఏమీ తోచేదికాదు. బాబయ్య మాటలు గుర్తుకువస్తూ ఉండేవి. నెమ్మదిగా నేనూ చదువు మొదలుపెట్టాను. అతని ఎంటెక్ అయ్యేటప్పటికి నాకు ఎం.ఎ పూర్తయింది. ఉద్యోగంలో చేరాలని అనుకున్నాను. ఇంతలో చైతన్య పుట్టాడు. వీడు కొంచెం పెద్దయ్యేటప్పటికి నా ఆలోచనలో మార్పు వచ్చింది. అతనిది మంచి ఉద్యోగం- మంచి జీతం. నేను ఏంచేసినా అడగని అతని ఔదార్యం. ఆర్థిక స్వాతంత్ర్యం కోసమంటూ ఉద్యోగంలో చేరి నా జీవితాన్ని వేగవంతం చేసుకోవాలని అని పించలేదు. కానీ వీడు స్కూలుకెళ్ళడం మొదలుపెట్టాక అంతా ఖాళీ. ఏం చెయ్యాలో తెలియక షాపింగ్, సినిమాలు, ఇంటినిండా సామాన్లు, బీరువా నిండాదొంతర్లుదొంతర్లుగా చీరలు. కొన్నాళ్ళకి అవీ విసుగనిపించాయి. అందుకే వేరే ఏదైనా చేద్దామని అనిపించి మనస్సుకు నిత్యం ఉత్తేజాన్నిచ్చే పని మొదలుపెట్టాను. అదేమిటో రేపు నీకు చూపిస్తాన"ని చెప్పి నాక్కాసిని పాలు తెచ్చిచ్చి పడుకుంది. నాకు చాలాసేపు నిద్దరపట్టలేదు. ఆలోచిస్తూనే ఉన్నాను.

> *నేను- నా జీవితం అన్నమాటలు గుర్తులేవు. కొత్తలో నా సమస్త శక్తీ ఆయనని సంతోషపెట్టడానికి ఉపయోగించేదాన్ని. తరువాత పిల్లలూ- వాళ్ళ చదువులూ వాళ్ళ ఇష్టాలూ వాళ్ళ స్నేహాలూ. వీటిమధ్యలో నాకు ఊపిరి సలిపేది కాదు. ఇంతలో పిల్లలకీ ఆయనకీ మధ్యలో వచ్చే చిన్నతేడాలూ... దానివల్ల వాళ్ళ మనసుకి కలిగే కష్టాలూ వీటిని సరిచెయ్యడానికి నా తెలివితేటలూ- ఓర్పూ సరిపోయేవి. నాకు నచ్చనిదేదైనా ఉన్నా కూడా ఎవ్వరిదగ్గరా చెప్పలేకపోయేదాన్ని. సంసారంలోఉన్న మిగిలిన ఇబ్బందులకంటె నాకు నా ఇష్టం ముఖ్యమని పించేది కాదని ఇప్పుడు అనిపిస్తోంది. నాకూ ఇష్టాలూ- అయిష్టాలూ ఉండేవి.*

నాకు మెళుకువ వచ్చేటప్పటికి చైతన్య బాక్స్ సర్దుకుంటున్నాడు. వాడు స్కూలుకు వెళ్ళాక ఏదో ఈపనీ- ఆపనీ చేస్తూ నాతో మాట్లాడుతూనే ఉంది నాగు. 12 గం.కు భోజనాలు చేశాక ఒకచోటకు వెళ్దామని ప్రయాణం చేసింది నన్ను. ఎక్కడికంటే చెప్పలేదు.

పదిహేను నిమిషాలలో ఆటో ఒక అనాధ శరణాలయం ముందు ఆగింది. ఇద్దరం లోపలకు వెళ్ళేటప్పటికి ఒక ముప్ఫైమంది పిల్లలు దాన్ని చుట్టుముట్టేశారు. వాళ్ళందర్నీ కూచోబెట్టుకుని 'రామ పట్టాభిషేకం' కథ చదివి చెప్పింది కాసేపు. తరువాత అందరికీ బొమ్మలు వెయ్యడం నేర్పింది. అలా ఒంటిగంట నుండి మూడుగంటల వరకు అక్కడ గడిపాము. వాళ్ళందరి పేర్లు నాకు చెప్పించింది. విచిత్రం'! ఆ టైములో వాళ్ళు దీని కోసం ఎదురుచూసేలా చేసుకుంది. అంత ఉత్సాహం ఆ పిల్లల్లో నాక్కనిపించింది. పండుగలకి పబ్బాలకి వాళ్ళకి ఏదైనా చేసి పట్టుకెళ్ళి ఇస్తుందట. ఆ పనిలో దానికి చాలా ఆత్మతృప్తి ఉందని దాన్ని చూస్తేనే తెలుస్తోంది. వాళ్ళ పిల్లాడి పుట్టినరోజు పండుగ కూడా వీళ్ళ దగ్గరే జరుపుతోందట. రెండు సంవత్సరాలు వాడికి ఊహ తెలిశాక పెద్ద హోటల్లో అందర్నీ పిలిచి సరదాగా చేశారట. ఎన్నోరకాల బహుమతులు వచ్చాయట. వీళ్ళు ఖర్చు పెట్టినదానికి సరిపడా వచ్చేసేవిట. ఇంటికొచ్చాక పిల్లాడు అవన్నీ విప్పి చూసుకొని తనకు పని కిరానివన్నీ ఇచ్చేరని సణుక్కునేవాడట. ఇదంతా చెప్తూ అది అన్నమాట నాకు చాలా ఆశ్చర్యమనిపించింది. ఇది ఆ నాగేనా? అని.

"పిన్నీ! వాడికి పుచ్చుకోవడంలో ఉన్న తృప్తే తెలుస్తోంది కానీ ఇవ్వడంలో ఉన్న ఆనందం తెలియడంలేదు. ఇలా పెరగనిస్తే వీడు మనకు కాకుండా పోతాడు. కనీసం తల్లిదండ్రులకైనా పనికిరానివాడి జీవితం ఎందుకు పిన్నీ!" అంది.

అందుకే ఆ తరువాత నుండి పుట్టినరోజుకి వీడికి బట్టలు కుట్టించడంతోపాటు వీళ్ళకి ఉపయోగించేవి ఏమైనా కొని ఇప్పిస్తోందట. వీలుంటే ఆదివారం వీణ్ని తీసుకుని ఆ పిల్లల దగ్గరకు వచ్చి గడు పుతుందట. వాడు ఇంటికి వచ్చి ఆ పిల్లల్ని గురించి ఆలోచిస్తూ బెంగగా ఉంటాడట. 'ఆమాత్రం గుండెతడి వీడికి కలిగితే అంతే చాలు' అని అంటూండగానే ఇంటికి వచ్చేశాము.

మేమిద్దరం ఇంటికి వచ్చాక చాలాసేపు నేను మామూలు ప్రపంచంలోకి రాలేకపోయాను. నా సమస్య నేను తీసుకున్న నిర్ణయం దీనికి చెప్పనా అని ఆలోచిస్తున్నాను. అనుకుంటూండగానే అది వచ్చి నా దగ్గర కూర్చుంది.

'పిన్నీ! నువ్వు కాకినాడలో శ్రావణిలో ఉంటావని అన్నావట కదా! సుమ కళ్ళనీళ్ళు పెట్టుకుని "మా అమ్మని సుఖంగా ఉంచలేకపోతున్నానక్కా! అలా అని కొన్ని విషయాల్లో రాజీపడడం కూడా నావల్లకావడంలేదు" అని అంది పిన్నీ! ఈరోజు నువ్వు మాదగ్గర ఉండలేకపోతే, బాబయ్య చేసిన ప్రయత్నమంతా వృధాకదా! ఆడపిల్లలకి అన్నిటా చేదోడు వాదోడుగా ఉండాలని నేర్చుకున్న రాజు దగ్గర, వదిన పై చెయ్యి తీసుకుని నీకు ఉండడానికి అవకాశం లేకుండా చేసింది. ఈ సంధియుగంలో మా ఇళ్ళలో రేగే ఘర్షణ వల్ల నీకు ఉండే అవకాశం లేకపోతే మా ఈ అభివృద్ధి ఎవరిని రక్షించడానికి పిన్నీ! మీరు సంఘానికి ఎదురీదిన దానికి ఫలితమే ఇది అని రాజు తలెగరెయ్యడానికి అవకాశం కల్పించినవాళ్ళం అవుతామేమో!

బాబయ్య దీనస్థితిలో ఉన్న ఆడపిల్లల ఉజ్జ్వల భవిష్యత్‌కై తపనపడి మా పరిస్థితిని మెరుగుపరిచారు. కానీ ఆ ఆడపిల్లలకి తగిన మొగపిల్లలు ఇంకా రెడీ కాలేదు. చదువుకుని, ఉద్యోగంచేసి సంపాదించి ఇంటిని జ్ఞానజ్యోతిని చేసే భార్య కావాలి నేటి మొగపిల్లలకీ వారి తల్లిదండ్రులకీ. కానీ ఈ ప్రయత్నంలో- వాళ్ళు వాళ్ళ సౌకర్యాలనీ, సంఘం కల్పించిన హోదాలనీ వదులుకోరు. అందుకే మనకి ఈ సంఘర్షణ తప్పడంలేదు. కానీ, ఇప్పుడు మా దగ్గర పెరిగే పిల్లలు అలా ఉండరు. అందుకే ఇన్నిరోజులు మాకోసం అన్నీ సహించుకున్న నువ్వు ఇప్పుడు ఇలాంటి నిర్ణయం తీసుకోవద్దు. నీ త్యాగంతో ఆత్మవిశ్వాసంతోనూ, గౌరవంగానూ బతకాలనుకుంటున్న మమ్మల్ని చూసి గర్వపడు. వీలయితే వాళ్ళ మధ్యలో చిన్న వంతెన ఏర్పాటుచెయ్యడానికి ప్రయత్నం చెయ్యి. నువ్వు మాత్రమే ఆపని చెయ్య గలవని నా నమ్మకం" అంటూ చాలాసేపు చెప్పింది. నేను ఏమీ మాట్లాడలేదు.

నాగు వాళ్ళింటి దగ్గర నుండి వచ్చేటప్పటికి ఇంట్లో పరిస్థితి చాలా తేడాగా ఉంది. కుసుమ చాలా అశాంతిగా ఉన్నట్టు అనిపించింది. దాన్ని అలా చూడలేక, ఏం చెయ్యాలో తెలియక డాక్టరుగారిని చూపించుకుంటానని చెప్పి ఇక్కడకు రమ ఇంటికి వచ్చేశాను. వచ్చానుగానీ మనసు స్థిమితంగా లేక- ఒంట్లో కూడా ఓపికలేక నాలుగురోజులూ అలా పడుకునే ఉన్నాను. రమతోకూడా అంతా చెప్పాను. అది కూడా 'ఇవన్నీ తప్పవులే అమ్మా!' అంది. నాకే ఈ పిల్లలు ఇంతింత చదువుకుని సంపాదించుకుంటూ ఇంత అలజడితో అశాంతిగా బతుకుతున్నారేమిటా అని ఆలోచన. నేను ఈ గట్టుకు వచ్చి చాలాసేపయినట్లుంది. ఎర్రటిసంధ్య నెమ్మదిగా తెల్లని చల్లని వెన్నెలలోకి మారుతోంది. ఇంకొంచెంసేపట్లో అంతా వెన్నెలమయమయిపోతుంది. రమ ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేటప్పటికి నేను ఇంట్లో లేకపోతే కంగారుపడుతుంది. చిరువెలుగులో నెమ్మదిగా నడవడం మొదలుపెట్టాను.

అప్పుడే వచ్చినట్టుంది మధు. ఇంకా స్కూలు డ్రస్సులోనే ఉంది. 'మధూ! నాకు వచ్చే ఆదివారానికి ఒక టిక్కెట్టు తెచ్చిపెడతావా?' అన్నాను. 'ఏమిటి అమ్మమ్మా! నీ సంగతి నాకు అర్థమవడంలేదు. తాతగారు లేక ఎక్కడా ఉండలేకపోతున్నావు' అంటూ వేళాకోళం చేస్తోంది. కాని ఇప్పుడు నా సంగతి- నేను చెయ్యవలసినది నాకు అర్థమయినట్లే ఉంది.

•



3